# అభినందన

శ్రీ గరజాపు శోభాపేరిందేవి



"అమ్మాయిని తీసుకురా జానకీ" లోపల గదిలో ఉన్న భార్యకి వినిపించాలని గట్టిగా అన్నాడు జగన్నాధరావు.

"పదవే సిగ్గుపడుతూ ఎంతసేపు కూర్చుంటావు" అంది కూతురుతో జానకి.

"సిగ్గుపడుతూ కూర్చోలేదమ్మా ఆలోచిస్తూ కూర్చున్నాను. ఓ అరగంట సేపు ఒకరి ఎదురుగా ఒకరు కూర్చుని ఒకటో అరో మాట్లాడుకుని ఓ నెలలోపల పెళ్ళి చేసుకునే పద్ధతి తమాషాగా ఉందికదా అని ఆలోచిస్తున్నాను. ఇలా అయితే ఒకరి మనస్థత్వాలు మరొకరికి ఎలా తెలుస్తాయమ్మా?" అంది సుచల ఆవేశంగా!

"తరతరాలనుండీ కొనసాగుతున్న పద్ధతే తప్ప నిన్నో మొన్నో వచ్చినది కాదుగా! మేమంతా ఇలా చేసుకున్న వాళ్ళమేగా! అయినా సుఖంగా కాపురం చేయటంలేదూ? నువ్వూ అలాగే చేస్తావు. అది సరేకానీ మరీ అంత సింపుల్‌గా ముస్తాబయ్యావేమిటే తల్లీ? జూకాలైనా పెట్టుకుంటావా?"

తల అడ్డంగా తిప్పుతూనే నవ్వింది సుచల.

"సరేలే పద!" అంది కూతురుని తొందర పెడుతూ జానకి.

ఇద్దరూ ముందర గదిలోకి వచ్చారు. పెళ్ళివారికి ఎదురుగా ఉన్న కుర్చీలో

కూర్చుంది సుచల. కూతురి పక్క కుర్చీలో కూర్చుంది జానకి.

అంతవరకూ కాఫీ సిప్‌చేస్తూ సుచల అన్నతో మాట్లాడుతున్న సుగుణ్ నిటారు అయ్యాడు. అతని తల్లీ, చెల్లెలు సౌందర్యకూడా ఆసక్తిగా చూడసాగారు.

తెలుపు మీద గులాబీ పూవుల ప్రింటున్న అర్గండీ చీరా జాకెట్టులో చిన్న బొట్టు, చిన్న రింగులు, సన్నటి బంగారు గొలుసూ, ఒకో చేతికి ఒకో బంగారు గాజుతో అతి సింపుల్‌గా ఉండి అత్యంత ఆకర్షణీయంగా కనబడింది సుచల.

"మా అమ్మాయి రచయిత్రి అండీ!" గర్వంగా నవ్వుతూ చెప్పాడు తండ్రి.

సుగుణ్ భ్రుకుటి ముడిపడింది.

"అలాగా ఏం పేరుతో రాస్తుంది? ఏ ఏ పత్రికలలో వచ్చాయి?" కుతూహలంగా అడిగింది సౌందర్య.

"ప్రచురితమైనవి రెండేనమ్మా! కానీ రచయిత్రిగా దీనికి ఉజ్వలమైన భవిష్యత్తు ఉందని నా గాఢనమ్మకం. నాకే కాదు దాని కథలు చదివినవారెవరికైనా అదే ఉద్దేశ్యం కలిగి తీరుతుంది" అన్నాడు జగన్నాధరావు.

సుగుణ్‌కీ అతని తల్లికీ ఈ ప్రసక్తి మీద అంత ఆసక్తి లేదని కనిపెట్టిన జానకి మాటను మార్చేసి వంటావార్పు, కుట్లూ, అల్లికలవైపు తిప్పింది.

జగన్నాధరావు గారింటినుండి తిరిగి వచ్చినప్పటినుండీ విపరీతంగా ఆలోచించసాగాడు సుగుణ్ 'సుచలని చేసుకోవాలా వద్దా' అని! సుచల అందరికీ నచ్చింది. 'హోటలు భోజనంతో ఎంతకాలమని దేవుళ్ళాడతావు? పిల్ల బుద్ధిమంతురాలులా ఉంది. ఒప్పేసుకో' అని పోరసాగింది.

సుగుణ్‌కి రచయిత్రులమీద సదభిప్రాయం లేదు. 'ఆడవాళ్ళు కడుపు నిండా అన్నం తిని కిళ్ళీ నములుతూ ఓ పక్కన నిద్రవల్ల కళ్ళు కూరుకుపోతుంటే పడక కుర్చీలో కూర్చుని సాయంత్రమయ్యేదాకా ప్రేమ నవలలు రాసేస్తూ ఉంటారు అనుకుంటాడు. పని మనిషి రావడంతో కథా రచనకి బ్రేకు పడుతుంది. మళ్ళీ రాత్రయ్యేదాకా ఇక తీరిక లభించదు. తిరిగి రాత్రి రాస్తారు ప్రొద్దుటిలాగే నిద్రకళ్ళతో చూస్తూ! అందుకే స్త్రీల రచనలు చప్పగా, చైతన్య రహితంగా ఉంటాయి అని మొండిగా సౌందర్యతో ఎన్నోసార్లు వాదించాడు. సౌందర్యకి కోపం వచ్చి ఎంతమంది రచయిత్రులు గొప్పగా రాస్తున్నారో చెప్పింది చాలాసార్లు. ఆమె ఆ మాట చెప్పగానే 'మరి రచయిత్రులమీద ఇన్ని కార్టూన్లు ఎందుకు వస్తున్నాయి?' అని అడుగుతూ మరింత వెక్కిరించేవాడు.

అతని గాఢ నమ్మిక ఏమిటంటే కథలు రాసే అమ్మాయిలు మిగతా అమ్మాయిలకి భిన్నంగా పొగరుగా తమకి కొమ్ములున్నట్లు ప్రవర్తిస్తారు అన్నదే!

అతని దృష్టిలో ఆడపిల్ల అంటే అణుకువగా, అమాయకంగా ఏం పని చెప్పినా ఓపికగా చేస్తూ, తల్లితండ్రుల మాటా అన్నదమ్ముల మాటా జవదాటకుండా పెరిగి, పెళ్ళయ్యాక అత్తామామలు సాధిస్తున్నా పూజిస్తూ భర్త పెడసరంగా ప్రవర్తించినా ప్రసన్నం చేసుకోడానికి ప్రయత్నిస్తూ ఇటు పుట్టినింటికీ, అటు మెట్టినింటికీ పేరు తెచ్చేదిగా ఉండాలి. అన్న స్వభావం తెలిసిన సౌందర్య 'నన్ను పెంకిపిల్లని అన్నావుగా ఇన్ని రోజులూ! రచయిత్రి వదిన నీ పొగరు అణుస్తుందిలే' అనడంతో అతని ఆలోచనలు అధికమయ్యాయి. సుచల అందం అయస్కాంతంలాగ ఆకర్షిస్తూ ఈ ఆలోచనలన్నీ చెరిపివేయడంతో 'రెండు కథలు రాసినమ్మాయి రచయిత్రి ఏమిటి?' అనుకుని పెళ్ళికి సంతోషంగా అంగీకరించాడు.

పెళ్ళిలో 'నీ భార్య బాగుందిరోయ్' అని ఫ్రెండ్స్ అంటే గర్వంగా నవ్వాడు. 'అంతేకాదండోయ్ మా వదిన రచయిత్రి కూడా!' అని సౌందర్య చెప్పగానే అతనికి చాలా కోపం వచ్చింది. ఆ కోపంతోనే అతను ఓ నిర్ణయానికి వచ్చేసాడు. సుచల కథలూ కాకరకాయలూ అంటూ పిచ్చిపిచ్చి వేషాలు వేయకుండా ఆపడానికి తాను శాయశక్తులా ప్రయత్నించాలన్నదే ఆ నిర్ణయం. లేకపోతే 'ఫలానా రచయిత్రికి భర్తగా తప్పితే సుగుణ్‌గా నీకు ఈ సమాజంలో గుర్తింపు ఉండదు' అని సౌందర్య అన్నమాట నిజమయ్యే అవకాశం లేకపోలేదు.

భర్తతోబాటు విశాఖపట్నం వచ్చింది సుచల.

ఇల్లంతా నీట్‌గా సర్దింది. ఆ సాయంత్రం ఇద్దరూ బీచ్‌కి వెళ్ళారు.

"రా నీళ్ళవైపు వెడదాం" అన్నాడు సుగుణ్.


సుచలకి కదలాలని లేదు. ఆడపెళ్ళివారు హడావిడి పడుతున్నట్లు ఎగిసిపడుతున్న కెరటాలని, కన్నకూతుర్ని అత్తవారింటికి పంపగానే తమ కంటివెలుగు కనుమరుగైందే అని డీలా పడుతున్నట్లుగా అణగారిపోతున్న అవే కెరటాలని చూస్తూ కలాన్ని కాగితంమీద కదపాలని ఉంది. తన కథకి రూపాన్ని ఇవ్వాలని ఉంది. అయినా తప్పనిసరిగా సుగుణ్‌ని అనుసరించింది.

ఆ మర్నాడు—

ఆఫీసుకు వెడుతున్న సుగుణ్‌తో గోముగా అంది సుచల "నాకు కాగితాలూ ఎన్విలప్‌లూ తెచ్చిపెట్టరూ" అని!

సుగుణ్‌కి వద్దని అనాలనిపించినా కొత్త పెళ్ళాం మూడ్ చెడగొడితే తనని అలరించక అలిగి కూర్చుంటుందేమోనని తప్పనిసరిగా తల ఊపాడు.

సుగుణ్ తెచ్చిన కాగితాలు కిలకిలమంటూ సుచలలోని రచయిత్రిని రాయ



మంటూ ప్రోత్సహించాయి. రా రమ్మంటూ ఆహ్వానించాయి. అతను ఇంట్లో లేని సమయాల్లో హాయిగా రాసుకుంటూ కూర్చుంది.

ఓ పది కథలు సంతృప్తికరంగా రాసి సుగుణ్‌కి ఇచ్చి పోస్టు చేయమంది. సుగుణ్ అయిష్టంగా ఆ ఒక్కసారికీ పోస్టుచేసాడు.

"కాగితాలన్నీ అయిపోయాయి కనక కొత్తవి కావాలి" అంది ఓ రోజు.

"అవి ప్రచురితం కానీ!" అన్నాడు సుగుణ్.

దానికీ దీనికీ సంబంధం ఏమిటో ఆమెకి అర్థంకాలేదు. అయినా ఆ ప్రస్తావన తేలేదు. ఆలోచనలు కాగితాలను తీసుకురమ్మని మారాం చేస్తున్నాయి. అయినా భర్తని అడగలేదు.

రెండు నెలలు గడిచాయి.

శ్రావణమంగళవారం నోములకోసం పుట్టింటికి వెళ్ళింది.

"ఎలా ఉందమ్మా అక్కడ?" అని అడిగిన తల్లికి 'బాగానే ఉంది' అని జవాబిచ్చింది సుచల.

"కొత్త కథలేమైనా రాసావా తల్లీ? రాస్తే మాత్రం అశ్రద్ధచేయక ఎప్పటి కప్పుడే పోస్టు చేసెయ్యి. ఆలోచనలు రమ్మన్నప్పుడు రావమ్మా! అవి వచ్చిన వెంటనే వాటిని మలచాలి. కథలు తిరిగి వచ్చాయే మునుపు ఇప్పుడు కూడా అలా వస్తే భర్తదగ్గర అవమానం అనుకోకు. ఇవాళ తిప్పిపంపిన పత్రికల ఎడిటర్లే రేపు నీ చుట్టూ తిరిగేలా తప్పక ఎదుగుతావు తల్లీ, నాకు తెలుసు అన్నాడు తండ్రి."

ఆ ప్రోత్సాహమే కావాలి సుచలకి! కలం కాగితాలమీద కూచిపూడి నృత్యం చేసింది. వాటిని తండ్రికి చూపించింది. ఆయన మెచ్చుకుని పోస్టు చేసాడు. సుచల రాసిన కొత్త కథలు తప్పక ప్రచురితమై ఆమెకి పేరు తెచ్చిపెడతాయని భార్యకీ కొడుకుకీ చెప్పాడు.

విశాఖపట్నం రైలెక్కిన సుచల నిర్వికారంగా కూర్చుంది. కారణం రచయిత్రులను గురించి ఎన్నోసార్లు వ్యంగ్యంగా మాట్లాడిన భర్త గుర్తు వచ్చాడు. తన కథలు ఒకటీ రెండు చదివి నవ్వడం గుర్తొచ్చింది. తన కథలలోని లోపాలు ఎత్తి చూపిస్తే తాను బాధపడదు. కానీ వెక్కిరిస్తే విపరీతంగా బాధపడుతుంది. ఆ బాధ తల్లి ఎదురుగా బిడ్డని వెక్కిరిస్తే తల్లి పడే బాధలాంటిదే అని అతనికి ఎలా తెలుస్తుంది?'

రైలు దిగి ఆటోలో ఇల్లు చేరుకునే సరికి బజ్జర్ నొక్కింది.

తలుపు తీసాడు సుగుణ్. అతని కళ్ళు అదోలా నవ్వుతున్నాయి. "నీ కోసమే చూస్తున్నాను రా" అన్నాడు.

కాళ్ళైనా కడుక్కోకుండా ప్రయాణపు బడలికవల్ల సోఫాలో కళ్ళు మూసుకుని కూర్చుంది.

"నువ్వు లేని నెలరోజుల్లో ఒకదాని తర్వాత ఒకటిగా నీ పది కథలూ తిరిగి వచ్చాయి చూసుకో" అంటూ కవర్లు సుచల ఒడిలోకి విసిరాడు.

సుచల కళ్ళు సెలయేళ్ళయ్యాయి. 'భర్త కొట్టినందుకు బాధగా లేదు కానీ తోటికోడలు చూసినందుకే బాధ' అన్న సామెత గుర్తొచ్చింది.

"చూడు సుచలా! ఇక నువ్వు కథలు రాయడానికి వీల్లేదు. రాసినట్లు తెలిస్తే ఊరుకోను. అయినా రచయిత్రి

కావాలని ప్రతీ అడదీ ఎందుకు అనుకుంటుందో నాకు అర్థంకాదు. 'స్త్రీగా పుట్టినందుకు రచనలు చేయడం నా ధర్మం' అని మీ రనుకోవడం సిల్లీగా ఉంది. ప్రతిభ అన్నది మనిషితో పుట్టి, మనిషికంటె వేగంగా ఎదిగి అతను మరణించినా అది జీవించే ఉంటుంది. అది ఓ గొప్ప వరం. భగవంతుడు తనంతట తానుగా ఇవ్వవలసినదే తప్ప సాధించగలిగేది కాదు. కనక ఇక ఈ పిచ్చికి స్వస్తి చెప్పు."

"చీరల మీదా, టేబుల్‌క్లాత్‌ల మీదా ఎంబ్రాయిడరీలు చెయ్యి. వైరుబ్యాగులు అల్లు. కొత్త వంటకాలు నేర్చుకో!"

సుచల అచేతనంగా కూర్చుండిపోయింది. ఆడవాళ్ళంటే ఎంత చులకన! రచయిత్రులంటే ఎంత హీనభావం! ఫలానా వ్యక్తి భార్యగా పరిగణించబడుతూ కుట్లూ అల్లికలతో కొట్టుమిట్టాడుతూ భర్తసేవ చేస్తూ ఉండడాన్ని మించి మరి కాస్త కూడా ఆధునికంగా ఆలోచించని అతనిని చూస్తే అసహ్యం వేస్తోంది. రచనలు తన సర్వస్వం! కానీ రచనల జోలికి పోవద్దు అంటాడా? అతను వద్దు అంటున్నకొద్దీ రాయాలని ఉంది. అతను వెక్కిరించినందుకైనా అతని ఊహకందనంతగా రచయిత్రిగా ఎదగాలని ఉంది. తన రచనలకోసమైనా ఆర్థికంగా తాను నిలబడాలి అనుకుంది దృఢంగా!

సాయంత్రం ఆఫీసు నుండి వస్తూ ఓ అప్లికేషన్ తెచ్చాడు సుగుణ్.

"ఈ కథల ఊసు నువ్వు మరచిపోవాలంటే నీకు కాలక్షేపం కావాలి. అందుకే ఇది తెచ్చాను. నువ్వు బియ్యేసీ బియ్యీడీ పాసయ్యావు కనక టీచర్ ఉద్యోగం సులభంగా రావచ్చు అన్నాడు ఈ స్కూల్ హెడ్‌మాస్టర్. లెఖ్ఖల టీచర్‌గా నువ్వు నిలద్రొక్కుకోగలవని నా నమ్మకం" అన్నాడు.

ఆ తర్వాత సుచల టీచర్‌గా చేరింది. ఆమె తనకి తెలియకుండానే భర్తకి దూరదూరంగా మసలసాగింది. నాలుగు కాగానే బడి వదిలేస్తారు. అప్పుడు ఇంటికి వచ్చి వ్యాసంగాన్ని హాయిగా సాగించేది. అతను వచ్చేసరికి మాత్రం ఆ మాట ఎత్తేది కాదు. వాటి జోలికి పోయేది కాదు. కాలం కదిలిపోతున్నంత వేగంగా సుచల కలమూ కదలసాగింది.

ఓరోజు—

"కంగ్రాట్స్‌రా!" అన్నాడు సుగుణ్ పిన్నికొడుకు బజార్లో కనబడి!

"ఎందుకు?"

"వదినకి కథల పోటీలో మొదటి బహుమతి వచ్చినందుకు! అదీకాక ఏ పత్రిక తిరగేసినా ఆవిడ కథలే కనబడుతున్నందుకు! 'సాహితి' అన్న కలం సృష్టి అద్భుతం అని మా అందరి నమ్మకం! ఆ వ్యక్తిని గురించి తెలుసుకోవాలని చాలా కుతూహలం కూడా

ఉంది. ఇన్నాళ్ళకి మా కోరిక తీరింది. ఇంత గొప్ప రచయిత్రి మా వదిన అని అందరికీ చెప్పేసాను. వదిన గురించి ఒక్కసారైనా చెప్పి ఏడ్చావా? ఇద్దరూ కలిసి రహస్యం చేసేసారు. తన రచనలలో నీకేది ఇష్టంరా?"

ఉక్కిరిబిక్కిరి అయినా సుగుణ్ వెర్రిగా నవ్వుతూ తను నా భార్య కావడంవల్ల తను ఏం రాసినా నాకు నచ్చుతుందిరా। ఎటొచ్చీ తేల్చవలసిన సమస్య ఇలాంటిది వస్తే మీలాంటి వాళ్ళనే అడుగుతాను" అన్నాడు.

అంతటితో ఊరుకోలేదు. "వెధవ ఉద్యోగం మానేసి హాయిగా రాసుకుంటూ కూర్చో అని ఎన్నిసార్లు చెప్పినా వినలేదనుకో।" అన్నాడు.

ఇంటికి వచ్చిన సుగుణ్ భార్యని ఎత్తి గిరగిరా తిప్పేసాడు. పొగడ్తల వర్షం కురిపించాడు.

నవ్వి ఊరుకుంది సుచల.

సుగుణ్ చూస్తుండగానే సుచల ఆంధ్రుల అభిమాన రచయిత్రి అయిపోయింది. ఆమె సీరియల్ పడిన పత్రికకి గిరాకీ పెరగసాగింది. ఆమె నవలలని సినిమాగా తీస్తే బాగా హిట్ కాసాగింది. మాటలు కూడా రాసింది ఎన్నో సినిమాలకి। ఏ పత్రిక తిరగేసినా ఆమె కథో, వ్యాసమో ఉండితీరుతుంది.

ఎప్పుడో ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేసింది.

ఆ రోజు సుచలకి సన్మానం। ఆమె నవలకి సాహిత్య అకాడమీ అవార్డు రావడమే సన్మానానికి కారణం.

సుచల మెడ దండలతో నిండిపోయింది. ఆమె మోము దరహాసంతో వెలిగిపోయింది.

మైకుని అందుకుంటూ చుట్టూ చూసింది.

అన్ని వయసులవాళ్ళూ కూర్చుని తన వైపు ఆరాధనగా చూస్తున్నారు. తన మాటలు వినడానికి చెవులు నిక్కబొడుచుకున్నట్లుగా ఉన్నారు.

'ఇందరి అభిమానాన్ని అందుకుందీ అంటే ఎంత పుణ్యం చేసుకుందో।'

"నేను స్టేజి ఎక్కి మాట్లాడడం ఇదే మొదటిసారి. కనక తప్పులు దొర్లినా తడబాటు కలిగినా అది స్టేజి ఫియర్‌గా గమనించి నన్ను క్షమించాలి. నాకు మీరందరూ నీరాజనా లర్పిస్తూ ఈ స్టేజి మీద నిలబెట్టారే కానీ నిజంగా నేనంత గొప్పదాన్ని కాను. నాలోని రచయిత్రిని గాంచి అది ఎదిగేలా చేసిన ప్రతీ వ్యక్తీ ఈ సన్మానానికి అర్హుడే అని నేనంటాను.

"భూమిమీదికి రాగానే క్యారుమంటుంది పసిబిడ్డ 'నన్ను కాపాడండి' అంటున్నట్లుగా। ఆ పరిస్థితిలో పాపాయికి తల్లి పాలివ్వకపోతే శిశువు బ్రతుకుతుందా? బ్రతకదు। నాలోని రచయిత్రికి ప్రోత్సాహం అనే పాలబువ్వని అమ్మా నాన్నా అన్నలు తినిపించకపోతే

అది తప్పక చనిపోయేదే. రాసిన కథలను పోస్టుచేసేదాకా ఊరుకోలేదు. తిరిగి వచ్చిన కథలను చూసి తల్లడిల్లిపోతుంటే ఓదార్చారు. మళ్ళీ కలాన్ని అందించారు. ఏ కళాకారిణికైనా కళాకారుడికైనా ఆ రకమైన ప్రోత్సాహం ఉండితీరాలి. అలా నేను నిలద్రొక్కుకునే ప్రయత్నంలో ఉండగా నాకు పెళ్ళయ్యింది." చెప్పడం ఆపి భర్తవైపు చూసింది. ఏం చెబుతుందా అని టెన్షన్‌గా చూస్తూ కూర్చున్నాడు సుగుణ్.

"మావారు నాకు అందజేసిన ప్రోత్సాహం వెలకట్టలేనిది. ఎవరి ఊహకీ అందనిది. వంటలో సాయం చేస్తూ నా కాలాన్ని రచనలకే వినియోగించుకునేలాగ చేసారు. ప్రతీ రచనకీ తన అమూల్యాభిప్రాయాన్ని చెబుతూ లోపాలను దిద్దారు. వాటికి మరింత మెరుగులు దిద్దారు. రాత్రి ఒంటిగంట దాకా కూర్చుని ఫెయిర్ చేసారు. అది వారాలైతే వాటితోటే గడిపారు. ఇప్పటికీ అదే ప్రోత్సాహాన్ని కొనసాగిస్తున్నారు. నా కథ ప్రచురితమైందని తెలియజేసే కార్డు వచ్చినా పరమానందం చెందడం, బహుమానం వచ్చినా చిన్నపిల్లాడిలా మురిసి మైమరచిపోవడం కళ్ళకు కట్టినట్లే ఉంది.

ఇక మీ ప్రోత్సాహం సంగతి చెప్పనే అక్కరలేదు. ప్రతీ రచనసీ మెచ్చుతూనో విమర్శిస్తూనో రాసారు. రాస్తున్నారు. కనక ఈ సన్మానం జరగవలసింది మట్టిబొమ్మలాంటి నన్ను మలచుకున్న మీ అందరికే. మీ కందరికీ కృతజ్ఞతలు" అంటూ కూర్చుంది. ఆమె మనసు ఆమెని అభినందించింది. నీ భర్తని పదుగురిలోనూ అవమానించకుండా మెచ్చుకోవడం చాలా మంచి పని. ఇలాకాక అతన్ని వేలెత్తి చూపితే వేరే నిన్ను తిట్టేవారు, భర్తని మించిపోయావన్న గర్వంతో అలా చేస్తున్నావని. అలాంటి పరిస్థితిలో కూడా నేను రాసి ఇలా ఎదిగానని గర్వంగా చెప్పుకుంటున్నావని: అంది మూగగా అభినందిస్తూ.

